# ప్రాసక్రీడలు

శ్రీశ్రీ

కొంతమంది కుర్రవాళ్ళు
పుట్టుకతో వృద్ధులు
పేర్లకీ పకీర్లకీ పు
కార్లకీ నిబద్ధులు

నడిమి తరగతికి చెందిన
అవగుణాల కుప్పలు
ఉత్త మొద్దు రాచ్చిప్పలు
నూతిలోని కప్పలు

తాతగారి నాన్నగారి
భావాలకి దాసులు
నేటినిజం చూడలేని
కీటక సన్యాసులు

నిన్నటి వీరుడి ధోకా
నేడు చూడజాలరు
కన్నులున్న జాత్యంధులు,
కాకినైన పోలరు

వీళ్ళకి కళలన్నా రస
మన్నా చుక్కెదురు
గోలచేసి అరవడమొక
టే వీళ్ళెరుగుదురు

కొంతమంది యువకులు రా-
బోవు యుగం దూతలు
పావన నవజీవన బృం
దావన నిర్మాతలు

బానిస పంథాలను తల
వంచి అనుకరించరు
పోనీ అని అన్యాయపు
పోకడలు సహించరు

వారికి నా ఆహ్వానం
వారికి నా శాల్యూట్
కడలి తరగలాపెదవా
భడవా ఓ కాన్యూట్